క్లుప్తంగా

సంక్రాంతి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలి




మాజీ ఎమ్మెల్యే కిలివేటి, నేదురుమల్లి

నాయుడుపేట టౌన్/వెంకటగిరి రూరల్ : సంక్రాంతి పండుగ ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆకాంక్షించారు. వారు సోమవారం ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షాలు తెలిపారు. సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దహనం



గూడూరు రూరల్: కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచడాన్ని నిరసిస్తూ సోమవారం సీపీఎం, సీఐటీయూ, ప్రజా సంఘాల నాయకులు ప్రజలతో కలిసి భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొడతామని హెచ్చరించారు. విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. జోగి శివకుమార్, బీవీ.రమణయ్య, ఎస్.సురేష్, అడపాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత కలువాయి



విజేత జట్టుతో ఎస్ఐ సుమన్, నాయకులు

కలువాయి: మండల కేంద్రమైన కలువాయిలో మూడు రోజులు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఇందులో కలువాయి యూత్ జట్టు విజేతగా నిలిచింది. అనంతసాగరం మండలం మంచాలపల్లి జట్టు ద్వితీయ స్థానం, పొదలకూరు జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు మొదటి బహుమతిగా రూ.10 వేలు, రెండో బహుమతిగా రూ.5 వేలు, మూడో బహుమతిగా రూ.2,500లను నిర్వాహకుడు బి.నాగరాజు, ఎస్ఐ సుమన్, చల్లా రఘురామిరెడ్డి, గడ్డం కిశోర్‌రెడ్డి, చల్లా శివారెడ్డి అందజేశారు.

హోటల్‌లో అగ్ని ప్రమాదం



తడ: మండలంలోని తడ కండ్రిగ పంచాయతీ, బీఎల్‌పాడులో జాతీయ రహదారి పక్కన ఉన్న ఓ ప్రైవేటు హోటల్లో సోమవారం అగ్ని ప్రమాదం జరిగింది. స్థానికుల సమాచారం మేరకు.. షార్ట్ సర్క్యూట్ వల్ల మూడో ఫ్లోరులో అగ్నిప్రమాదం జరిగింది. పై ఫ్లోర్‌లో ఉన్న లాడ్జిలో రెండు గదుల్లో అద్దెకు దిగిన నలుగురు వ్యక్తు లు బయటకు వచ్చే దారిలేక చిక్కుకున్నారు. సమాచారం అందుకున్న తడ ఎస్ఐ కొండపనాయుడు సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. సూళ్లూరుపేట, అపాచి, శ్రీసిటీ నుంచి వచ్చిన అగ్ని మాపక సిబ్బంది అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. గదుల్లో చిక్కుకున్న అమెరికాకు చెందిన వృద్ధ దంపతులు, చెన్నైకి చెందిన జంటలోని వ్యక్తి గది అద్దాలు పగుల గొట్టి బయటకు వెళ్లే ప్రయత్నం చేస్తుండగా అతన్ని రక్షించారు. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించి ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. నలుగురూ ప్రమాదం లేకుండా బయట పడడంతో ఊపిరి పీల్చుకున్నారు.

దొంగ అరెస్టు

నాయుడుపేట టౌన్ : అంతర్రాష్ట్ర దొంగ రమేషను అరెస్టు చేసినట్లు సీఐ ఎం.బాబి తెలిపారు. ఆయన సోమవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. తమిళనాడు, ఆంధ్ర ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న ఇద్దరిని మూడు రోజుల క్రితం అరెస్టు చేసి రూ.20 లక్షల విలువైన 9 బైక్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. పరారీలో ఉన్న తమిళనాడుకు చెందిన రమేష్‌ను సోమవారం అరెస్టు చేసినట్లు వివరించారు. అతని నుంచి ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

చిల్లకూరు మండలంలోని కలవకొండలో ప్యాచ్ వర్క్ చేసిన రోడ్డు





చిల్లకూరు మండలం తిక్కవరంలో ప్యాచ్ వర్క్ చేసిన రోడ్డు ప్రస్తుత పరిస్థితి

పైపై పూత.. నిధుల మేత

కూటమి నేతలు అధికారాన్ని అడ్డుపెట్టుకుని దోచుకోవడమే ధ్యేయంగా పెట్టుకున్నారు. ఇసుక, గ్రావెల్, మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారు. తాజాగా వారి కన్ను గ్రామీణ ప్రాంతాల రోడ్లపై పడింది. వాటికి మరమ్మతుల పేరుతో తూతూమంత్రంగా ప్యాచ్ వర్కులు చేసి ప్రజా ధనాన్ని బొక్కేశారు. అధికారులు కూడా వారికి సహకరించారని ఆరోపిస్తున్నారు. సంక్రాంతి పండుగకు రోడ్లు అందంగా చేస్తామన్న చంద్రబాబు మాటలకు అర్థం ఇదా అని విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

- పక్కదారి పడుతున్న ప్రజా ధనం
- పట్టించుకోని అధికారులు

చిల్లకూరు: మండలంలోని తీరప్రాంత గ్రామాలకు వెళ్లే పారిచెర్లవారిపాళెం నుంచి ఉడతావారిపాళెం క్రాస్ రోడ్డు వరకు మరమ్మతులు చేయడానికి రూ.75 లక్షలు మంజూరయ్యాయి. ఈ పనులను ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ప్రారంభించారు. గ్రామాల వద్ద పనులు చేయొద్దని, అక్కడ సీసీ రోడ్లు వేసేందుకు నిధులు మంజూరు చేయిస్తామని స్థానిక ప్రజా ప్రతినిధి రోడ్లు, అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో కాంట్రాక్టర్ తూతూమంత్రంగా ప్యాచ్ వర్కులు చేశారు. అవి మూన్నాళ్ల ముచ్చటగా మారి దెబ్బతిన్నాయి. ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో ప్రయాణించాలంటే ఒళ్లు గుల్ల అవుతోందని స్థానికులు వాపోతున్నారు. తిక్కవరం, చేడిమాల, కలవకొండ ప్రాంతాల్లో అడుగుకో గుంత పడింది. అలాగే గూడూరు మండలంలోని వెంకటగిరి రోడ్డులో రూ.40 లక్షలతో ప్యాచ్ వర్కులు చేసినా ఫలితం లేదు.

ప్యాచ్ వర్కులే గతి

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట మున్సిపాలిటీలోని జీఎన్‌టీ రోడ్డు దయనీంగా మారింది. వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీని మరమ్మతుల కోసం రూ.40 లక్షలు మంజూరు చేశారు. తూతూమంత్రంగా పనులు చేసి మమా అనిపించారు. ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే లింక్ రోడ్లు అధ్వానంగా మారాయి. గుంతల్లో కంకరతో సిమెంట్ కలిపి వేశారు. అవి వాహనాల దాటికి పైకి లేచిపోయి గుంతలు పడ్డాయి.

- సూళ్లూరుపేట మండలంలోని ఇలుపూరు నుంచి తుంగమడుగు రోడ్డు సుమారు 21 కి.మీ వరకు ఉంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు 15 కి.మీల వరకు గుంతలు పడ్డాయి. వాటిని పూడ్చేందుకు ఎండీఆర్ నిధుల కింద రూ.30 లక్షలు మంజూరుచేశారు. ప్రస్తుతం మంగళంపాడు నుంచి తుంగమడుగు వరకు ప్యాచ్ వర్క్ పనులు ప్రారంభించారు. గుంతల్లో కంకర పోసి వదిలేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఆబాక గ్రామం నుంచి దొరవారిసత్రం మండలంలోని కారికాడు వరకు ప్యాచ్ వర్కుల కోసంరూ.15 లక్షలు మంజూరయ్యాయి. ఇక్కడ పనులు జరగక పోవడంతో ప్రజలకు ప్రయాణం నరకంగా మారింది.
- తడ మండలం మాంబట్టు సెజ్‌కు వెళ్లే రోడ్డు గుంతలమయమైంది. దీనికి రూ.40 లక్షలతో ప్యాచ్ వర్కులు చేసి చేతులు దులుపుకున్నారు. అక్కంపేట నుంచి అండగుండాల మీదుగా కారిపాకం వెళ్లే రోడ్డు అధ్వానంగా వుంది. ఇది పీఆర్ పరిధిలో వుండడంతో ప్యాచ్ వర్కులకు కూడా నోచుకోలేదు.
- దొరవారిసత్రం నుంచి పూలతోట గ్రామం వరకు సుమారు 8 కిలోమీర్లు ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డుకు వారం క్రితం ప్యాచ్ వర్క్ చేశారు. దొరవారి సత్రం నుంచి మైలాంగం, నెల్లూరుపల్లి గ్రామాల మీదుగా కలగుంట వరకు 7 కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు పనులు మొదలుకాలేదు. టెండర్ల ప్రక్రియ జరుగుతోందని అధికారులు చెబుతున్నారు.
- నాయుడుపేట–శ్రీకాళహస్తి రోడ్డు అత్యంత దారుణంగా వుంది. ఎన్నిసార్లు ప్యాచ్ వర్కులు చేసినా వాహనాల దాటికి గుంతలు పడుతూనే వున్నాయి. అన్నమేడురోడ్డు, అయ్యపురెడ్డిపాళెం రోడ్లపై గుంతలు పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్యాచ్ వర్కుల కోసం రూ.20 లక్షలు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు.
- పెళ్లకూరు, ఓజిలి మండలాలకు ఇంకా నిధులు మంజూరు కాలేదు. ఈ రెండు మండలాల్లో ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్‌శాఖ రోడ్లు అధ్వానంగా వున్నాయి. ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని స్థితి. ఓజిలి మండలంలో గొల్లపల్లి–ఓజిలి రోడ్డుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.55 లక్షలు మంజూరు చేసింది. కాంట్రాక్టర్ పనులు ఆలస్యం చేయడం, తర్వాత ఎన్నికల కోడ్ రావడంతో పనులు పూర్తిగా ఆగిపోయాయి. ప్రస్తుతం పూర్తిస్థాయిలో తారు రోడ్డు వేయడానికి అదే నిధులతో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు.

గుంతల్లో కంకర వేసి వదిలేశారు

కోట: మండలంలో గూడలి, విద్యానగర్, కోట, కొక్కుపాడు, ఉత్తమనెల్లూరు, గోవిందపల్లి రోడ్డు గుంతలమయమైంది. వాటిని పూడ్చేందుకు రూ.60 లక్షలు మంజూరయ్యాయి. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ గుంతల్లో కంకర వేసి వదిలేశారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బదులు పడుతున్నారు.



కోట : కంకర వేసి వదిలేసిన విద్యానగర్ రోడ్డు

కలువాయి– తెలుగు రాయపురం రోడ్డు

కలువాయి: కలువాయి తెలుగురాయపురం రోడ్డు దారుణంగా ఉంది. దీని మరమ్మతులకు ప్రభుత్వం రూ.12 లక్షలు విడుదల చేసింది. కొన్నిచోట్ల పనులు చేపట్టి నిధులు సరిపోవని ఆపేశారు.

నిత్యం ప్రమాదాలే



వెంకటగిరి బంగారుపేట బీసీ కాలనీ రోడ్డు

సైదాపురం: మండలంలోని గూడూరు–రాపూరు రోడ్డులోని 6 కిలోమీటర్లు వరకు గుంతలు పడి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. రాపూరు – చేర్లోపల్లి రోడ్డు, మర్లపూడి–చీకవోలు రోడ్డు అధ్వానంగా ఉండడంతో వాహనదారులు హడలిపోతున్నారు. ప్యాచ్‌లు కూడా వేసే దిక్కులేకుండాపోయింది. వెంకటగిరి పట్టణంలోని బంగారుపేట బీసీ కాలనీ వద్ద వెంకటగిరి– గూడూరు రోడ్డులోని పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. అదేవిధంగా డక్కిలి, బాలాయపల్లి మండలాల్లోని గ్రామీణ ప్రాంతాల రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. వీటికి ప్యాచ్ వర్కులు చేసేందుకు రూ.2.70 కోట్లు మంజూరయ్యాయి. వాటితో నామమాత్రంగా పనులు చేసి చేతులు దులుపుకున్నారు.



దొరవారిసత్రం-పూలతోట రోడ్డు



అండగుండాలకు వెళ్లే రోడ్డు దుస్థితి ఇది



నాయుడుపేట పట్టణంలో ఆర్అండ్‌బీ రోడ్డు దుస్థితి ఇది



వర్షాలకు దెబ్బతిన్న పునబాక-చెంబేడు రోడ్డు దుస్థితి

అంగరంగ వైభవంగా గోదాదేవి కల్యాణం



చిల్లకూరు : మంగళ సూత్రం చూపుతున్న వేద పండితుడు



రాపూరు : పెంచలస్వామి, గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

చిల్లకూరు/నాయుడుపేట టౌన్: భోగి పండుగను పురస్కరించుకుని సోమవారం చిల్లకూరు మండలం కలవకొండ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం, నాయుడుపేటలోని వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో గోదాదేవి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు. కలవకొండ ఆలయంలో జరిగిన కల్యాణా నికి పారిచెర్లవారిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల టీచర్ మంజుశ్రీ, వెంకటసాయి చైతన్య, మోనిషా, నాయుడుపేటలో జరిగిన కల్యాణానికి ఆర్యవైశ్యం సంఘం నేతలు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

రాపూరులో..

రాపూరు: మండలంలోని పెంచలకోనలో పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, గోదాదేవి కల్యాణం ఘనంగా నిర్వహించారు. గోదాదేవి 30 రోజులపాటు ధనుర్మాస వ్రతాన్ని ఆచరించి భోగి పండుగనాడు స్వామి వారిలో ఐక్యమైంది. ఈ క్రమంలో భోగి నాడు గోదాదేవి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం 9 గంటలకు గోదాదేవిని, పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవ మూర్తులను తిరుచ్చిపై కొలువుదీర్చారు. విశేషంగా అలంకరించి వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఆస్థాన సేవ, కల్యాణం చేశారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం

వాకాడు: పేద విద్యార్థులకు శ్రీ సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ రామిరెడ్డి మధు, కిరణ్‌రెడ్డి దాతృత్వంతో సోమవారం బాలిరెడ్డిపాళెం పట్టాభిరామాలయంలో ఆర్థిక సాయం అందజేశారు. వాకాడుకు చెందిన మనపాటి సుమ, పనబాక శ్రీనాథ్‌కు రూ.6000 చొప్పున అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు దీవి అనంతాచార్యులు, అనురూప్‌రెడ్డి, సాయికౌసిక్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, శ్రీరామ సేన సభ్యులు హరీష్‌రెడ్డి, గురుప్రసాద్, వంశీ, కోట్లపూడి శ్రీనివాసులు పాల్గొన్నారు.



పోలీసులను అడ్డుకున్న వ్యక్తికి రిమాండ్

వెంకటగిరి రూరల్ : పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిని పోలీసులు సోమవారం రాత్రి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు.. వెంకటగిరి రాణిపేటలోని రామాయం వీధిలో యువకులు సోమవారం తెల్లవారుజామున లౌడ్ స్పీకర్లు పెట్టి చిందులు వేస్తున్నట్టు సమాచారం అందడంతో కానిస్టేబుళ్లు చక్రవర్తి, సురేష్‌బాబు అక్కడికి వెళ్లారు. అక్కడున్న చల్లా బాబు అనే వ్యక్తి కానిస్టేబుళ్లను అడ్డుకున్నాడు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ నిందితుడిని అరెస్టు చేసి జడ్జి ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

కోలాహలంగా భోగి పండుగ



నాయుడుపేట పట్టణంలో భోగి మంటలు వేస్తున్న యువకులు



సూళ్లూరుపేట పట్టణంలో భోగి మంటలు వేస్తున్న దృశ్యం

సూళ్లూరుపేట/నాయుడుపేట టౌన్/దొరవారిసత్రం/పెళ్లకూరు/రాపూరు/కలువాయి/వెంకటగిరి రూరల్: సూళ్లూరుపేట పట్టణంతోపాటు గ్రామీణ ప్రాంతాలు, నాయుడుపేట పట్టణం, రూరల్ ప్రాంతాలు, దొరవారిసత్రం, పెళ్లకూరు, వెంకటగిరి పట్టణం, రాపూరు, కలువాయి, సైదాపురం మండలాల్లో సోమవారం భోగి పండుగను జరుపుకున్నారు. ప్రజలు తమ ఇళ్లలోని పాత వస్తువులు, దెబ్బతిన్న వాటిని భోగి మంటల్లో వేసి నూతన వెలుగులకు స్వాగతం పలికారు. సూళ్లూరుపేట ప్రాంతంలోని పరిశ్రమల్లో పనిచేస్తున్న యువతీ యువకులు భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. నాయుడుపేట సమీపంలోని మేనకూరు సెజ్‌లోని పరిశ్రమల వద్ద కూడా భోగి పండుగను జరుపుకున్నారు.

విద్యార్థికి బంగారు పతకం



బంగారు పతకం సాధించిన వెంకటేష్

చిల్లకూరు: మండలంలోని నెలబల్లి రెట్టపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎం.వెకటేష్ అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించినట్లు పీఈటీ ఎస్‌కే మస్తాన్‌బీ సోమవారం తెలిపారు. గత ఏడాది డిసెంబర్‌లో అనంతపురం జిల్లా కదిరిలో రాష్ట్ర స్థాయిలో జరిగిన జంప్ రోప్ పోటీల్లో వెంకటేష్ ప్రతిభ చూపాడు. జనవరి 6 నుంచి 8వ తేదీ వరకు నేపాల్‌లో జరిగిన ఇండో – నేపాల్ ఇంటర్ నేషనల్ టోర్నమెంటులో పాల్గొని బంగారు పతకం సాధించాడని తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

గూడూరు రూరల్ : గూడూరు శివారు అడివయ్య కాలనీలో ఆదివారం అర్ధరాత్రి వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. అడివయ్య కాలనీకి చెందిన మున్నాభాయ్ (45) ఒక పరిశ్రమకు కాంట్రాక్టు మీద కూలీలను సరఫరా చేసేవాడు. ఈ క్రమంలో పరిశ్రమ వద్దకు వెళ్లి తిరిగి వచ్చిన కొద్ది సేపటికే అతను ఉరి వేసుకుని మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

భక్తిశ్రద్ధలతో చండీయాగం

చిల్లకూరు : తీర ప్రాంతంలోని తూర్పు కనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో సోమవారం చండీయాగం నిర్వహించారు. ప్రతి పౌర్ణమికీ చండీయాగం నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చి 12 కలశాలు ఏర్పాటు చేశారు. తదుపరి చండీయాగాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. ఇందుకు ఉభయకర్తలుగా చెన్నైకి చెందిన మూర్తి వీరరాఘవులు శెట్టి, హంస కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్ పర్సన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ, ఈవో నవీన్‌కుమార్, ట్రస్టు బోర్డు సభ్యులు దువ్వూరు చంద్రశేఖర రెడ్డి, ఆలయ అర్చకులు శివకుమార్ స్వామి పాల్గొన్నారు.

గాయపడిన మహిళ మృతి

చిల్లకూరు : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి నెల్లూరులోని చికిత్స పొందుతున్న మహిళ సోమవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని ముత్యాలపాడుకు చెందిన వినీషా (38) సొంత పనుల నిమిత్తం చిల్లకూరు వచ్చింది. తిరిగి ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆమెను కుటుంబ సభ్యులు నెల్లూరుకు తరలించారు. అక్కడ ఆమె సోమవారం మృతి చెందింది. నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలికి భర్త, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు.